క్లుప్తంగా

'గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు పాటించాలి'

పరవాడ: అచ్యుతాపురం బ్రాండెక్స్ పరిశ్రమలో విష వాయువు లీకేజీ బాధితులకు లక్ష రూపాయలు చెల్లించాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలను తక్షణమే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆస్పత్రిలో చికిత్స పొందిన 539 మందికి మూడు నెలల వ్యవధిలో పరిహారం చెల్లించాలని ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. ఇప్పటికైనా యాజమాన్యం కార్మికుల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం


జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం శుక్రవారం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి కల్యాణం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యావచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు శ్రీకాంత్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

పార్కు అభివృద్ధికి పరిశీలన


అధికారులతో చర్చిస్తున్న మహేష్

సింహాచలం: జీవీఎంసీ 97వ వార్డు పరిధి చినముషిడివాడ వుడాకాలనీలో పార్కు అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై శుక్రవారం జీవీఎంసీ అధికారులు, వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్ పరిశీలన చేశారు. పార్కు అభివృద్ధి చేయాలని వుడాకాలనీ నిర్వాసితులు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌ను కోరారు. ఆయన ఆదేశాలతో జీవీఎంసీ అధికారులు పరిశీలనకు వచ్చారు. అసోసియేషన్ నాయకులు, నిర్వాసితులతో సంబంధిత పార్క్ అభివృద్ధి ప్రణాళికపై చర్చించారు. రెండు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పార్కును అభివృద్ధి చేస్తే నిర్వాసితులకు ఉపయోగదాయకంగా ఉంటుందని మెంటి మహేష్ తెలిపారు.

గడ్డిలోడుతో ట్రాక్టర్ బోల్తా


బోల్తాపడిన ట్రాక్టర్

సింహాచలం: గడ్డిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్ శుక్రవారం సాయంత్రం పెందుర్తి మండలం లక్ష్మీపురం వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్‌తో పాటు అందులో ఉన్న ఒక వ్యక్తి కింద పడిపోయారు. స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎలాంటి పెద్ద ప్రమాదం సంభవించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

అక్కయ్యపాలెం పరస రేపు

సీతంపేట: గౌరీ సేవా సంఘం అక్కయ్య పాలెం ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ ఆదివారం భూలోకమాంబ, ముత్యమాంబ, కుంచుమాంబ, వేంకటేశ్వర స్వామి, సీతారాముల వారి పరస మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం అక్కయ్యపాలెం మూడు గుళ్ల వద్ద సంఘ మాజీ అధ్యక్షుడు బొడ్డేటి మోహన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు కొయిలాడ వేణుగోపాల్ మాట్లాడుతూ ఆరోజు ఉదయం 5 గంటలకు అమ్మవార్ల ప్రథమ పూజతో పరస ప్రారంభమవుతుందన్నారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 11 గంటల వరకు తప్పెట గుళ్లు, సేవా గరిడీలు, కోలాటం వంటి అనేక సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యుత్ దీపాలంకరణతో కనుల పండువగా జరుగుతుందన్నారు.

దర్జాగా కబ్జా!


గంగవరంలో ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన రేకుల షెడ్

- ప్రభుత్వ భూమిలో ప్రైవేటు బోరు ఏర్పాటు
- షెడ్‌తో పాటు నిర్మాణాలకు రంగం సిద్ధం
- గంగవరం పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణ

సబ్బవరం: జీవీఎంసీ పరిధిలోని గంగవరం పరిసర ప్రాంతాల్లో విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయి. కోట్లాది రూపాయిల విలువ చేసే ప్రభుత్వ భూములను అక్రమార్కులు ప్లాట్‌లు వేసి యథేచ్ఛగా అమ్ముకుంటున్నారు. గంగవరం పరిసర ప్రాంతాలతో పాటు గంగవరం రెవెన్యూ పరిధిలో అర్బన్ హౌసింగ్‌లో భాగంగా జగనన్న కాలనీల్లో పెద్ద ఎత్తున గృహ నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో ఈ ప్రాంతం రూపురేఖలు మారిపోయాయి. భూముల విలువ అమాంతం పెరిగింది. ఇదే అవకాశంగా అక్రమార్కులు కోట్లాది రూపాయిలు విలువ చేసే ప్రభుత్వ భూముల ఆక్రమణకు పాల్పడుతున్నారు. దర్జాగా ఆ భూముల్లోపాగా వేసి ప్లాట్‌లు వేసి క్రయవిక్రయాలు చేపడుతున్నారు. వీటికి అడ్డుకట్ట వేయాల్సిన రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను సైతం మాయం చేస్తున్నారు. అయినప్పటికీ కేసు నమోదు చేయకపోవడంతో స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.


సర్వే నెంబర్ 38లో చేపడుతున్న నిర్మాణాలు

ఇదీ పరిస్థితి

మండలంలోని గంగవరం రెవెన్యూ సర్వే నెంబర్ 38లో 38.37 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీనిలో 38–1లో 20.44 ఎకరాల ప్రభుత్వ ఉండగా, 38–2 నుంచి 12 వరకూ సబ్ డివిజన్లు చేసి గతంలో కొంతమంది లబ్ధిదారులకు డీపట్టాలు ఇచ్చారు. 38–1లోని 20.44 ఎకరాల్లోని కొంత స్థలంలో గంగవరం కాలనీ ఉండగా మిగిలిన స్థలం ఖాళీగా ఉంది. ఆ భూములను కొంతమంది ఆక్రమించి షెడ్లు నిర్మించుకున్నారు. మరికొంత మంది స్థానికేతరులకు అమ్ముకోవడంతో భూములు చేతులు మారుతున్నాయి. ఆక్రమణదారులు ముందు చిన్నపాటి పాకలు,తర్వాత రేకులు షెడ్లు వేసి చివరికి పక్కా భవనాలు నిర్మించుకుంటూ వ్యూహాత్మకంగా ప్రభుత్వ భూములను కొల్లగొడుతున్నారు. ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలతో పాటు బోర్లు కూడా తీయించి దర్జాగా కబ్జా చేస్తున్నారు.


ప్రభుత్వ భూమిలో తీసిన బోర్ వెల్

చర్యలు తీసుకుంటాం



ప్రభుత్వ భూములు ఆక్రమించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. గంగవరం సర్వే నంబర్ 38లో ఆక్రమణలకు పాల్పడి షెడ్లు నిర్మించినట్లు మా దృష్టికి వచ్చింది. దీంతో వారికి ఫారం–7 వెకేషన్ నోటీస్ ఇచ్చాం. అయినా వారు పట్టించుకోకుండా బోర్ వెల్ ఏర్పాటు చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. అలాగే వెదుళ్లనరవ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 39లో 18 ఎకరాలు ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించాం. ఆనంద్ కుమార్ అనే వ్యక్తి ఈ భూమిని కొనుక్కున్నట్టు చెబుతున్నారు. ప్రభుత్వ భూమి 18 ఎకరాలు కొనుక్కోవడానికి అనర్హుడిగా తెలియజేస్తూ నోటీసు ఇవ్వడంతో పాటు పోలీస్‌లకు ఫిర్యాదు చేశాం.

– బి. సత్యనారాయణ, తహసీల్దార్, సబ్బవరం మండలం

ముగిసిన రుద్రరాజశ్యామల హోమం


మహా పూర్ణాహుతిలో పాల్గొన్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దంపతులు, కుటుంబ సభ్యులు

సింహాచలం: పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆధ్వర్యంలో రాంపురంలోని ఆయన స్వగృహంలో మూడు రోజులుగా నిర్వహించిన రుద్ర రాజశ్యామల హోమం శుక్రవారంతో ఘనంగా ముగిసింది. మూడోరోజు హోమం శాస్త్రోక్తంగా నిర్వహించి అనంతరం మహా పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. అనంతరం 108 మంది ముత్తైదువులకు అదీప్‌రాజ్ దంపతులు తాంబూళం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు బాగుండాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పెందుర్తి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసే శక్తి ప్రసాదించాలని రుద్ర రాజశ్యామల హోమం నిర్వహించినట్లు చెప్పారు.

సులభ్ కాంప్లెక్స్ పనులు ప్రారంభం


సబ్బవరం సంతబయలు వద్ద పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ ప్రసాదరావు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరం మేజర్ పంచాయతీలోని సంతబయలు వద్ద రూ.4 లక్షలతో నిర్మించనున్న సులభ్ కాంప్లెక్స్ పనులను శుక్రవారం సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రం సబ్బవరంలో ఇప్పటి వరకూ సులభ్ కాంప్లెక్స్ లేదన్నారు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి మండల కేంద్రానికి పలు అవసరాలపై వచ్చే వారు కాలకృత్యాలు తీర్చుకునేందుకు ప్రజా మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో పంచాయతీ పాలవర్గం చర్చించి రూ.4 లక్షలతో సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసేందుకు తీర్మానించడం జరిగిందన్నారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రి బాబు, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, పంచాయతీ కార్యదర్శి మూర్తిబాబు,ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హిమబిందు, గ్రామ పెద్దలు,కార్యవర్గ సభ్యులు పల్ల తాతారావు,టి. శేఖర్,సబ్బవరపు శివ, కొల్లి కృష్ణ,సబ్బవరపు శివ,చిత్రాడ శ్రీను, యర్రంశెట్టి రాము పాల్గొన్నారు.

నిర్వాసిత గ్రామాల అభివృద్ధికి పెద్దపీట


సింహాద్రి జీజీఎం సిన్హాను సత్కరిస్తున్న నిర్వాసిత గ్రామాల సర్పంచ్‌లు

పరవాడ: నిర్వాసిత గ్రామాల అభివృద్ధే సింహాద్రి ఎన్టీపీసీ ధ్యేయమని సంస్థ జీజీఎం సంజయ్ కుమార్ సిన్హా అన్నారు. దీపాంజలినగర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన స్టేక్‌హోల్డర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా ప్రతినిధుల సహకారంతోనే నిర్వాసిత గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. నిరుద్యోగ యువతకు విజయవాడలో స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ కల్పించడానికి సంస్థ కృషి చేస్తుందని.. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగపర్చుకోవాలని కోరారు. మహిళా సాధికారత కోసం సంస్థ కృషి చేస్తుందని చెప్పారు. సీఎస్సార్ నిధుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. మున్ముందు సీఎస్సార్ నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని మౌలిక సదుపాయాల కల్పన కోసం తమ వంతు కృషి చేస్తామని, ప్రజాప్రతినిధులు కూడా సహాయ సహకారాలు అందించాలని జీజీఎం సిన్హా కోరారు. 77 వార్డుతో పాటు పరవాడ మండలంలోని పలు పంచాయతీల్లో మంచినీటి పథకాలు, సీసీ రహదారులు, కమ్యూనిటీ భవనాల నిర్మాణాలు, శ్మశాన వాటికల్లో సదుపాయాల కల్పన కోసం ప్రజా ప్రతినిధులు వినతులు సమర్పించారు. కార్యక్రమంలో మెయింటెనెన్స్ జీఎం శ్రీమాధ్యు, టీఎస్ జీఎం పద్మప్రియ, ఈఎంజీ ఏజీఎం వి.విజయన్, ఏజీఎం హెచ్‌ఆర్ రుమాడీశర్మ, హెచ్‌ఆర్ డీజీఎం అనిత్ కుమార్, సీనియర్ మేనేజర్ శ్రీమంత్‌పాత్రో, సీఎస్సార్ సీనియర్ మేనేజర్ కె.ప్రకాశరావు, 77 వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, సర్పంచ్‌లు ఎస్.అప్పలనాయుడు, ఎం.సన్యాసినాయుడు, బొండా కనకారావు, కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య, సీహెచ్.సుజాతముత్యాలు, సీహెచ్.మసేను పాల్గొన్నారు.

కరి సీతారామాచార్యులుకు ఘన సత్కారం


సీతారామాచార్యులుకు ప్రశంసా పత్రం అందజేస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: తిరుపతిలో ఈనెల 19, 20 తేదీల్లో వేంకటేశ్వర వేదిక్ యూనివర్సిటీ నిర్వహించిన సెమినార్‌లో గంటన్నరపాటు పాంచరాత్ర ఆగమ శాస్త్రంపై ప్రసంగించి నివేదిక అందజేసిన సింహాచలం దేవస్థానం పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులును శుక్రవారం ఈవో త్రినాథరావు ఘనంగా సత్కరించారు. పాంచరాత్ర, శైవాగమాలకు సంబంధించి బాలాలయ ప్రక్రియపై నిర్వహించిన సెమినార్‌లో దేశవ్యాప్తంగా పాల్గొన్న ప్రముఖుల్లో సీతారామాచార్యులు కూడా ఉండడం సింహాచలం దేవస్థానానికి గర్వకారణమని కొనియాడారు. కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు వారణాసి దినేష్‌రాజ్, పెనుమత్స శ్రీదేవివర్మ, ఏఈవో రమణమూర్తి పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన రాజశ్రీ పట్నాయక్

పరవాడ: వాడచీపురుపల్లి దరి ఎన్టీపీసీ దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్న ఒడిశాకు చెందిన వివాహిత రాజశ్రీ పట్నాయక్ (36) గురువారం ఆత్మహత్యకు పాల్పడినట్లు పరవాడ పోలీసులు చెప్పారు. సీఐ ఈశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన పంకజ్‌కుమార్, రాజశ్రీ పట్నాయక్‌లు భార్యభర్తలు. ఎన్టీపీసీ ఉద్యోగి అయిన పంకజ్‌కుమార్ రెండేళ్ల కిందట వివాహం చేసుకొని భార్య రాజశ్రీ పట్నాయక్‌తో కలిసి దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లో నివాసం ఉంటున్నారు. రాజశ్రీ పట్నాయక్ తల్లిదండ్రులు, సోదరుడు కూడా వీరి వద్దే ఉంటున్నారు. వీరికి 13 నెలల బాబు ఉన్నాడు. గురువారం మధ్యాహ్నం కుమారుడు ఏడుస్తున్నప్పటికీ రాజశ్రీ పట్నాయక్ పట్టించుకోకపోవడంతో తండ్రి సరోజకుమార్ పట్నాయక్ కుమార్తెను మందలించడంతో మనస్తాపం చెందిన రాజశ్రీ పట్నాయక్ ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకొని ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తలుపులు కొట్టినా తీయకపోవడంతో తలుపులు విరగ్గొట్టి చికిత్స నిమిత్తం ఎన్టీపీసీ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి సరోజ పట్నాయక్ ఫిర్యాదుతో పరవాడ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి వందపడకల ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం శవ పంచనామా జరిపి మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని సీఐ ఈశ్వరరావు చెప్పారు.

రైళ్ల పరిశుభ్రతకు సహకరించండి

- ప్రయాణికులకు డీఆర్‌ఎం విజ్ఞప్తి


డీఆర్‌ఎం అనూప్ కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: రైళ్లను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రయాణికులు సహకరించాలని, ఇది అందరి బాధ్యతని డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి అన్నారు. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం చేరుకున్న వందేభారత్ రైలును పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎప్పటికప్పుడు హౌస్‌కీపింగ్ సిబ్బంది రైలును శుభ్రం చేస్తున్నా కూడా విశాఖకు చేరేసరికి పలు కోచ్‌ల నిండా ప్లాస్టిక్ బాటిల్స్, పేపర్ కప్స్, వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ పారేసి ఉన్నాయని చెప్పారు. పరిస్థితిని చూసిన డీఆర్‌ఎం స్పందిస్తూ డోంట్ బీ బిట్టర్–స్టాప్ ద లిట్టర్ అని ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. ప్రతిష్టాత్మక వందేభారత్ రైలు శుభ్రంగా ఉంచాలని, దీనికోసం డస్ట్‌బిన్లను ఏర్పాటు చేశారని తెలిపారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఈవో శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఈవోతో పాటు, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు పాల్గొన్నారు.

గృహసారథుల ఎంపికపై కసరత్తు


గృహ సారథుల ఎంపికపై కసరత్తు చేస్తున్న నాయకులు

సబ్బవరం: మండలంలో గృహ సారథుల ఎంపికపై వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రి బాబు ఆధ్వర్యంలో శుక్రవారం ఆ పార్టీ కార్యాలయంలో నాయకులు కసరసత్తు చేశారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదేశాల మేరకు ఎంపిక ప్రక్రియ చేపట్టినట్టు కర్రి బాబు చెప్పారు. ప్రతి గ్రామ వలంటీర్ పరిధిలో ఇద్దరు గృహ సారథుల చొప్పున 700 మందికి పైగా గృహ సారథులను ఎంపిక చేయనున్నారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, పార్టీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, వనం అచ్చెంనాయుడు, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు నాయుడు,బి. మహలక్ష్మినాయుడు, కొటాన రమణ పాల్గొన్నారు.

పథకాలు చేరువ చేయడానికే గృహ సారథులు


మాట్లాడుతున్న 95వ కార్పొరేటర్ ముమ్మన దేముడు

సింహాచలం: ప్రజా సమస్యలు క్షేత్రస్థాయిలో తెలుసుకుని అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూసే బాధ్యత గృహ సారథులపై ఉంటుందని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు తెలిపారు. 95వవార్డు 502 సచివాలయం పరిధిలో గృహ సారథుల ఎంపిక ప్రక్రియ శుక్రవారం నిర్వహించారు. ముమ్మన దేముడు మాట్లాడుతూ గృహసారథి అంటే పదవి కాదని.. బాధ్యతగా గుర్తించి పని చేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారికి సక్రమంగా అందుతున్నాయో లేదో పరిశీలించడంతో పాటు వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాల్సిన బాధ్యత గృహసారథులపై ఉంటుందన్నారు. ప్రభుత్వానికి ప్రజాబలం నిండుగా ఉందని, అబలాన్ని పెంచుకోవడానికి సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల నియామకం చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు ప్రత్యేక ఆహ్వానితుడు చందు యాదవ్, సచివాలయ కన్వీనర్లు జి.బుజ్జి, విజయేంద్ర, కృష్ణ, కెవిఆర్.లక్ష్మి, దలాయి శ్రీను, జొన్నాడ సాయి కృష్ణ, ఎ.శ్రీను, ర ఘు, కె.సంతోష్, బి.దేవుడు బాబు, కె.అప్పలరాజు, చీర రాజు, రామారావు, రమణమూర్తి, శ్యామ్‌గౌరి నాయుడు, వెంకటరావు, సతీష్, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థల వల్లే ఆర్థిక ప్రగతి


మాట్లాడుతున్న రామారావు

కూర్మన్నపాలెం: ప్రభుత్వ రంగ సంస్థల వల్లే దేశంలోని ఆర్థిక వ్యవస్థ పురోగతి సాధిస్తోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. అటువంటి సంస్థలను కార్పొరేట్లకు అప్పగించడం సరికాదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 708వ రోజు, శుక్రవారం సీఎంఎం, సీఆర్‌ఎంపీ, సీఈడీ కార్మికులు పాల్గొన్నారు. దీక్ష శిబిరంలో పాల్గొన్న ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకుడు ఎస్. రామారావు మాట్లాడుతూ త్యాగాలు, పోరాటాల ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేస్తే సహించేది లేదన్నారు. దళితులు, బలహీన వర్గాలు, పేదల సంక్షేమాన్ని విస్మరించి కేంద్ర ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలకు దేశ సంపదను దోచిపెడుతోందని ఆరోపించారు. ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను, రాయితీలను సమసమాజ స్థాపనకు ఉపయోగపడే విధంగా చేస్తామని ప్రమాణం చేసిన కేంద్ర ప్రభుత్వం నేడు కార్మికుల హక్కులను పూర్తిగా కాలరాయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంఘీభావం తెలిపాయన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి కేంద్ర ప్రభుత్వం స్వస్తి పలికే వరకు వినూత్న రీతిలో నిరసన తెలియజేస్తూనే ఉంటామన్నారు. శిబిరంలో వివిధ విభాగాల ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రజా గర్జనతో కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం

- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- నిర్వాసిత కాలనీల్లో మహా పాదయాత్ర


పాదయాత్రలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అనే నినాదంతో స్టీల్‌ప్లాంట్‌ను సాధించుకున్నామని, దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటుపరం కానివ్వబోమని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. ఈ నెల 30న నిర్వహించనున్న ప్రజా గర్జనతో కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిపిస్తామన్నారు. ఐఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ గొందేశి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వాసిత కాలనీల్లో శుక్రవారం మహా పాదయాత్ర చేపట్టారు. నడుపూరులోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభమైన యాత్ర ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ ఉక్కునగరంలోని తృష్ణ మైదానంలో నిర్వహించనున్న ప్రజా గర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు, నిర్వాసితులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులను ఒకే వేదిక మీదకు తీసుకువచ్చి ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటామన్నారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ 708 రోజులుగా ఉద్యమాలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించే వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి మాట్లాడుతూ 32 మంది ప్రాణ త్యాగాలతో నిర్మించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ఎలా ప్రైవేటుపరం చేస్తారని ప్రశ్నించారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. నాయకులు, కార్మికులు, నిర్వాసితులు పెదగంట్యాడ జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, అనిపెద్ది మసేనురావు, నమ్మి రమణ, బొడ్డు పైడిరాజు, డి.వి.రమణ, పులి వెంకటరమణారెడ్డి, గొందేశి సత్యారావు, గొందేశి వెంకటరమణారెడ్డి, మహేశ్వరరెడ్డి, మార్డుపూడి పరదేశి, జగదీష్, నక్క రమణ, దొమ్మేటి అప్పారావు, నీరుకొండ రామచంద్రరావు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిపించాలి

ఉక్కునగరం: ప్రజా గర్జనతో కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిపించాలని స్టీల్‌ప్లాంట్ కార్మిక నాయకులు అన్నారు. ఈ నెల 30న ఉక్కు తృష్ణ మైదానంలో పెద్ద ఎత్తున నిర్వహించనున్న ప్రజా గర్జన ప్రచారంలో భాగంగా శుక్రవారం స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ విభాగం క్యాంటీన్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో నాయకులు మాట్లాడారు. లక్ష మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి ఉన్న ప్లాంట్‌ను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. ప్లాంట్ ప్రారంభం నుంచి వేల కోట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నులు, డివిడెండ్ల రూపేణా చెల్లించిందని చెప్పారు. ప్లాంట్ ప్రైవేటీకరణ జరిగితే, నిర్వాసితులు పూర్తిగా నష్టపోతారన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలు వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి పెద్ద ఎత్తున నిరసన తెలిపేందుకు అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల నాయకులను ఆహ్వానించామని తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేలా ప్రజలు సభకు హాజరు కావాలన్నారు.

గాంధీ అధ్యయన కేంద్రం సందర్శన

ఏయూ క్యాంపస్: జపాన్‌కు చెందిన శాస్త్రవేత్త, పారిశ్రామికవేత్త డాక్టర్ ఎస్‌వీఎస్ రావు శుక్రవారం ఏయూలోని గాంధీ అధ్యయన కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ రావు మాట్లాడుతూ జపనీయులు గాంధీజీ పని సంస్కృతిని అనుసరిస్తా రని చెప్పారు. విద్యార్థుల్లో గాంధేయ ఆలోచనలు, సిద్ధాంతాలను ప్రోత్సహిస్తున్న వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డిని అభినందించారు. మహాత్మా గాంధీపై ఫారినర్స్ వ్యూస్ అనే పుస్తకాన్ని డాక్టర్ రావుకు గాంధీయన్ స్టడీస్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ చల్లా రామకృష్ణ అందజేశారు. డాక్టర్ పి.కిషోర్‌కుమార్, డాక్టర్ కృష్ణవీర్ అభిషేక్ పాల్గొన్నారు.